ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
7
ఆదివారం 25 మే 2025



పాలీసెట్ ఫలితాల్లో
బాలికల హవా
- ఎంపీసీ, ఎంబైపీసీ విభాగాల్లో జిల్లాలో టాప్ ర్యాంకులు
- రెండు, మూడో స్థానాలను కైవసం చేసుకున్న వికారాబాద్ విద్యార్థులు

10

తాండూరులో తిరంగా ర్యాలీ



ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శనివారం తాండూరులో తిరంగా ర్యాలీని నిర్వహించారు. భారత్ మాతాకీ జై అని నినాదాలు చేశారు. గంజ్ ఎల్లమ్మ ఆలయం నుంచి ఇందిరాచౌక్, వినాయకచౌక్, శాంతిమహల్ చౌరస్తా మీదుగా భద్రేశ్వర్‌చౌక్ వరకు భారీ ర్యాలీ కొనసాగింది. ఇందిరాచౌక్ వద్ద జాతీయ మానవహారంగా ఏర్పడ్డారు. మేధావులు, స్వామీజిలు, రిటైర్డ్ ఉద్యోగులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.
- తాండూరు, మే 24(ఆంధ్రజ్యోతి)

ఘనంగా బీరప్ప బోనాలు



పెద్దేముల్ మండలం జనగాం శివారులో గల బీరప్పస్వామి ఆలయ బోనాల జాతర శనివారం నిర్వహించారు. మహిళలు నైవేద్యాలతో ఆలయానికి బయలుదేరారు. బోనాలతో పాటు ఊరేగింపుగా బీరప్ప వీరగొడుగుల ప్రదర్శన ఆకట్టుకుంది. డోలు వాయిద్యాల మధ్య మహిళలు ఆలయానికి చేరుకొని బీరప్పస్వామికి నైవేద్యాలు సమర్పించారు. ఊరువాడ, పాడిపంట బాగుండాలని మొక్కులు చెల్లించుకున్నారు.
- పెద్దేముల్, మే 24(ఆంధ్రజ్యోతి)

గొర్లకు మేతగా గోబి



మార్కెట్‌లో ధర లేక గోబి పంట పశువుల మేతగా మారింది. మోమిన్‌పేట్‌కు చెందిన రైతు అంగేరి రామ్‌రెడ్డి ఎకరా పొలంలో గోబి పంట సాగు చేశాడు. హైదరాబాద్‌లోని మూసాపేట్ మార్కెట్‌కు పంటను విక్రయించేందుకు తీసుకెళ్లగా కూలి, రవాణా ఖర్చులైనా రావడంలేదని ఆవేదనకు చెందాడు. దీంతో చేనును జీవాలు, పశువుల మేతకు వదిలేశాడు. సాగుకు రూ.లక్ష పెట్టుబడి పెట్టానని రైతు వాపోయాడు.
- మోమిన్‌పేట్, మే 24(ఆంధ్రజ్యోతి)

పంటకాలం ముగిసినా
అందని 'భరోసా'
- ఆశలు వదులుకుంటున్న రైతులు
- అందాల్సింది రూ.28కోట్లు.. ఇచ్చింది రూ.6కోట్లే!



మేడ్చల్ ప్రతినిధి, మే 24(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరుకల్లా యాసంగి సీజన్ ముగిసి వానా కాలం ప్రారంభమవుతుంది. అయితే ఇప్పటికీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రైతులకు రైతు యాసంగి రైతుభరోసా అందలేదు. ఇక అందనట్టేనని రైతులు ఆశలు వదులున్నారు. గతంలో ప్రభుత్వం రైతుబంధు కింద ప్రతీ 6నెలలకు ఎకరానికి రూ.5వేల చొప్పున ఇచ్చేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుభరోసా పేరుతో ఎకరానికి రూ.6 వేలిస్తామంది. గత డిసెంబరు నుంచే అందిస్తాని చెప్పినా 2025 మార్చిలో పథకాన్ని ప్రారంభించారు. అయితే మే ముగుస్తున్నా పంపిణీ పూర్తికాలేదు. యాసంగి సీజన్‌లో మొదట ఎకరా వరకు, ఆ తర్వాత రెండు ఎకరాలకు ఇలా పెంచుకుంటూ మూడెకరాల వరకు ఉన్న రైతులకు రైతు భరోసా ఇచ్చారు. జిల్లాలో రైతులకు పూర్తిస్థాయిలో రైతుభరోసా అందలేదు. మూడున్నర ఎకరాల్లోపు రైతులకే ఎకరానికి రూ.6వేల చొప్పున అందినట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 7,301 మంది రైతులకు రూ.6.21 కోట్లు మాత్రమే రైతు భరోసా ఇచ్చారు. నిజానికి 43వేల మంది రైతులకు రూ.28కోట్ల రైతు భరోసా ఇవ్వాల్సి ఉంది. 30శాతం మంది రైతులకే అందింది. రానున్న రోహిణీ కార్తెలో వర్షం పడితే రైతులు వానకాలం సాగును ప్రారంభిస్తారు. యాసంగిలో రైతు భరోసా రాని వారు వానాకాలంలో కూడా వస్తుందో రాదోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులూ క్లారిటీ ఇవ్వడం లేదు. నిధుల్లేకనే రైతు భరోసాపై ఎటువంటి స్పష్టత ఇవ్వడం లేదని తెలుస్తోంది.

బోనస్ డబ్బులకు ఎదురుచూపులు..

సన్న ధాన్యంకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ డబ్బులు కూడా రైతుల ఖాతాలో జమచేయ లేదు. దీనితో రైతులు బోనస్ డబ్బులకు కూడా ఎదురుచూస్తున్నారు. అధికారులు ఓ వైపు ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు రైతుల ఖాతాలో జమచేస్తున్నామని ప్రకటిస్తున్నా రైతుల ఖాతాల్లో డబ్బు జమవడం లేదు. నెల రోజుల నుంచి జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా వడ్లను సేకరిస్తున్నారు. కొనుగోళ్ల చివరి దశకు చేరుకున్నా రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు మాత్రం పడడంలేదు.


మన లైబ్రరీ

దౌల్తాబాద్‌లో 21వ శతాబ్దపు అభ్యాస కేంద్రం


రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు.. సృజనాత్మకత విద్యను అందుబాటులోకి తేవడమే లక్ష్యం

కలెక్టరేట్, జిల్లా గ్రంథాలయ సంస్థ, భారత్ దేఖో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల దౌల్తాబాద్‌లో 'మన లైబ్రరీ'ని ప్రారంభించారు. ఈ గ్రంథాలయంలో బాలల విజ్ఞాన, విద్యా కేంద్రం, సామాజిక కేంద్రం, డిజిటల్ అభ్యసన వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. పిల్లలు, యువత, పెద్దలు చదువుకునేందుకు ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేశారు. సమగ్ర విజ్ఞాన కేంద్రంగా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఈ 'మన లైబ్రరీ' రాష్ట్రంలో తొలిసారి ఏర్పాటు చేశారు. ఇక్కడ హైస్కూల్ విద్యార్థుల కోసం సైన్స్ సెంటర్‌ను నెలకొల్పారు. అలాగే యువతకు కాంపిటిషన్ ఎగ్జామ్స్ మెటీరియల్‌ను సైతం అందుబాటులో ఉంచుతున్నారు.

దౌల్తాబాద్‌లో మన లైబ్రరీ భవనం



వికారాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రతి ఒక్కరూ నేర్చుకోగలరు.. పదండి...! కలిసి నేర్చుకుందాం!, నేర్చుకొని సంతోషాన్ని ఆస్వాదిద్దాం.. అనే లక్ష్యంతో జిల్లా కలెక్టరేట్, జిల్లా గ్రంథాలయ సంస్థ, భారత్ దేఖో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లాలో 'మన లైబ్రరీ' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సాధారణంగా లైబ్రరీ(పౌర గ్రంథాలయం)లో వివిధ రకాల పుస్తకాలు, దినపత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాలు ఉంటాయి. కానీ ఈ గ్రంథాలయంలో పుస్తకాలే కాకుండా ఇక్కడకు వచ్చే వారు తమ తలరాతను మార్చుకునే విధంగా... భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు దిశానిర్దేశం చేసే కేంద్రంగా పనిచేయనుంది. ఈ గ్రంథాలయంలో బాలల విజ్ఞాన కేంద్రం, బాలల విద్యా కేంద్రం, సామాజిక కేంద్రం, డిజిటల్ అభ్యాస వనరుల కేంద్రం, పిల్లలు, యువత, పెద్దలు చదువుకునేందుకు ప్రత్యేక స్థలం ఏర్పాటు చేశారు. చిన్నా పెద్దా, నిరక్షరాస్యులు, విద్యావంతులు, పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా అందరి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేలా రూపొందించిన మన లైబ్రరీ కార్యక్రమం రాష్ట్రంలో తొలిసారిగా దౌల్తాబాద్‌లో శుక్రవారం ఆరంభమైంది. ఇక్కడ ఏర్పాటు చేసిన మన లైబ్రరీ సమాజ ఆధారిత అభ్యాస కేంద్రంగా, అన్ని వర్గాల సర్వతోముఖాభివృద్ధి కేంద్రంగా కొనసాగనుంది. పిల్లలు, యువత, తల్లిదండ్రులు, విద్యావంతుల్లో ప్రేరణ కల్పించి సృజనాత్మకత, అభ్యాసం



లైబ్రరీ లోపలి భాగంలో వాల్ పెయింట్

మిగతా 10వ పేజీలో...

భారత్ దేఖో...

సమాజంలో మార్పు కోసం యువతను ప్రేరణ శక్తిగా వినియోగిస్తూ విద్యా, ఆరోగ్య రంగాల్లో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2021లో భారత్ దేఖో సంస్థను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు, తల్లిదండ్రులకు ఉపయోగపడేలా 21వ శతాబ్ద నైపుణ్యాలు, నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధిపై ఈ సంస్థ దృష్టి సారించింది. రాష్ట్రంలో ఈ సంస్థ ప్రస్తుతం నారాయణపేట్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, వికారాబాద్ జిల్లాల్లో తన కార్యకలాపాలు కొనసాగిస్తోంది.



గురుకుల కళాశాలల మూసివేత నిర్ణయాన్ని
వెనక్కి తీసుకోవాలి
- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య

యాలాల, మే 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 12ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాలల మూసివేత నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గురుకులాల్లో అడ్మిషన్లు తీసుకోవడం లేదని తెలిపారు. ఈ రెసిడెన్షియల్ కాలేజీల్లో విద్యార్థులు లేరనే కారణంతో మూసివేయడం సరి కాదన్నారు. అడ్మిషన్లలో జాప్యం కారణంగానే విద్యార్థులు జాయిన్ అవడంలేదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అడ్మిషన్లు ప్రారంభిస్తే విద్యార్థులు చేరతారన్నారు. ఎస్సీ రెసిడెన్షియల్ కాలేజీలను మూసివేస్తే పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు రావడంలేదనే కారణంతో కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న గురుకులాల మూసివేతతో స్థానిక విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.


జాపాలలో శ్రీనివాస్‌రెడ్డి సాగుచేస్తున్న పందిరి కూరగాయలు

వ్యవసాయమే జీవనం
అందరికీ ఆదర్శం
ఆధునిక సాగులో రాణిస్తున్న కంది సోదరులు
- ఉద్యోగాల కంటే వ్యవసాయమే మిన్న అనుకున్నారు
- అందుబాటులో ఉన్న వనరులతో పంటల సాగు
- ఉత్పత్తులను మార్కెట్ తరలించి విక్రయాలు
- హోల్‌సేల్‌గా అమ్ముతూ లాభాల ఆర్జన

8

Sunday Special

వ్యవసాయమంటే అందరికీ ఆసక్తి ఉండదు. కొందరు మాత్రమే ఇష్టంతో ఈ రంగంలో రాణిస్తుంటారు. ముఖ్యంగా యువకులు ఎవరైనా వ్యవసాయం చేస్తున్నామంటే చిన్నచూపు చూస్తారు. వ్యవసాయమంటే దండగ అనే ఈ రోజుల్లో ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ పంటలు పండిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు కంది బ్రదర్స్. తమకున్న పరిజ్ఞానంతో కూరగాయల సాగు ద్వారా మంచి లాభాలను పొందుతున్నారు ఈ సోదరులు. మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిల సక్సెస్‌పై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.
- మంచాల, మే 24(ఆంధ్రజ్యోతి)



రేపటి నుంచి లైసెన్స్‌డ్
సర్వేయర్లకు శిక్షణ
- రంగారెడ్డిలో 437 మంది
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 143 మంది ఎంపిక

మేడ్చల్ ప్రతినిధి, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వేయర్ల కొరత దృష్ట్యా లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అనే నిబంధన ఉండటంతో రాష్ట్రంలోని భూములన్నీ సర్వే చేసి మ్యాప్‌లు రూపొందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సర్వేయర్ల కొరత కారణంగా లైసెన్స్‌డ్ సర్వేయర్లతో భూసర్వే చేయించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా లైసెన్స్‌డే సర్వేయర్లను ఎంపిక చేసింది. ఈ నెల 17వ తేదీ వరకు లైసెన్స్‌డే సర్వేయర్ల నుంచి మీసేవల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లాలో 437మంది, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 143మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను అధికారులు ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 26 నుంచి 50 రోజుల పాటు అధికారులు శిక్షణ ఇస్తారు. రంగారెడ్డి జిల్లాలో ఎంపికైన 437మందికి ముచ్చింతల్‌లోని స్వర్ణభారతి ట్రస్ట్ భవనంలో, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 143మందికి శామీర్‌పేటలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శిక్షణ ఇస్తారు. ఎంపికైన వారి వివరాలను అధికారులు ఇప్పటికే విడుదల చేశారు. సమాచారాన్ని అభ్యర్థులకు చేరవేశారు. రెండు నెలల పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ ఇవ్వనున్నారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం

రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఎంపికైన లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. సోమవారం నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. అభ్యర్థులు సోమవారం ఉదయం 10గంటలకు దరఖాస్తుతో జత చేసిన పత్రాలను వెంట తీసుకురావాలి. మొదట సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత శిక్షణ ఇస్తాం. భూ కొలతలకు సంబంధించి ఎటువంటి సామగ్రి ప్రభుత్వం ఇవ్వదు. అన్నీ ట్రైనీ సర్వేయర్లే సమకూర్చుకోవాలి.
- శ్రీనివాస్, ఏడీ

వీఏవో పరీక్షకు సర్వం సిద్ధం
జూన్ 2 నుంచి గ్రామాల్లో కొత్త రెవెన్యూ పాలన.. ● మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో పరీక్ష

మేడ్చల్ ప్రతినిధి, మే 24(ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసి వీఆర్‌ఏలు, వీఆర్‌ఓలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో అధికారులు ఉంటేనే పరిపాలన బాగుంటుందని మళ్లీ గ్రామ రెవెన్యూ పరిపాలన అధికారి వ్యవస్థను తేనుంది. గ్రామ రెవెన్యూ వ్యవస్థ రద్దుచేసే నాటికి జిల్లాలో 86మంది వీఆర్‌ఏలు, వీఆర్‌ఓలు ఉండేవారు. గ్రామపరిపాలన అధికారిగా పనిచేసే వారికి కనీస విద్యార్హత ఇంటర్, డిగ్రీ ఉండి, కనీసం ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని గ్రామపరిపాలన అధికారిగా దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాలో 52 మంది రాత పరీక్షకు అర్హులుగా నిర్ధారించి వారికి నేడు పరీక్ష నిర్వహించనున్నారు. అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ దినోత్సవాన గ్రామ పరిపాలన అధికారులుగా నియామకం అవుతారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అప్పట్లో వీఆర్‌ఏ, వీఆర్‌ఓల వ్యవస్థ ఉండేది. గ్రామాల్లో భూములకు సంబంధించిన సమాచారం, భూ వివాదాల పరిష్కారం, రికార్డుల నిర్వహణకు

మిగతా 10వ పేజీలో...


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

నేడు రాత పరీక్ష

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలో గల మహిళా డిగ్రీ కాలేజీలో గ్రామ పాలన అధికారి పరీక్ష నిర్వహిస్తారు. 52మంది వీఆర్వోలు పరీక్షకు హాజరవుతారని అధికారులు తెలిపారు. ఉదయం 10:30నుంచి మధ్యాహ్నం 1:30 వరకు పరీక్ష ఉంటుంది. కేంద్రంలోకి 9:30నుంచి 10గంటల వరకు మాత్రమే అనుమతిస్తారని అధికారులు సూచించారు. ఏవైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 733720990లో సంప్రదించాలని సూచించారు.

ముగ్గురు ఏఎన్‌ఎంల
డిప్యుటేషన్లు రద్దు
- జిల్లా వైద్యాధికారి వెంకటరవణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధారూరు, మే 24(ఆంధ్రజ్యోతి): నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వెళ్లిన ముగ్గురు ఏఎన్‌ఎంల డిప్యుటేషన్లను జిల్లా వైద్యాధికారి వెంకటరవణ రద్దు చేశారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 19న ఆంధ్రజ్యోతిలో 'ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్లు' శీర్షికన వార్తాకథనం ప్రచురితమైంది. ఈ కథనంపై అధికారులు స్పందించారు. డిప్యుటేషన్లపై వెళ్లిన ముగ్గురు ఏఎన్‌ఎంలు తమ పాత స్థానాల్లో చేరాలని డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశించారు. కాగా ఏఎన్‌ఎంలు విజయ నిర్మల రామయ్యగూడ యూపీహెచ్‌సీ, అంజిలమ్మ ధారూరు పీహెచ్‌సీ, మహబూబ్ బీజిన్‌గుర్తి పీహెచ్‌సీకి డిప్యూట్ అయ్యారు. వారి డిప్యుటేషన్లు రద్దు చేయడంతో పాత స్థానాలైన తరిగోపుల, కుక్కింద సబ్‌సెంటర్లలో ఏఎన్‌ఎంలు రిపోర్టు చేయనున్నారు.

కాపీ కొడుతూ బుక్కైన ముగ్గురు విద్యార్థులు

వికారాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలకు 235 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, కాపీ కొడుతూ ముగ్గురు ఫస్టియర్ విద్యార్థులు పట్టుబడ్డారు. మ్యాథ్స్-1ఏ, బాటనీ, పొలిటికల్ సైన్స్ ఫస్టియర్ పరీక్షలకు 3314 మంది విద్యార్థులకు 3,137 మంది హాజరు కాగా, వారిలో 174 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 3050 మందికి 2887 మంది హాజరు కాగా, 160 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 264 మంది విద్యార్థులకు 250 మంది హాజరు కాగా, 174 మంది గైర్హాజయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకెండియర్ పరీక్షలకు 1033 మందికి 972 మంది విద్యార్థులు హాజరు కాగా, 61మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 953 మందికి 895 మంది హాజరు కాగా, 58 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 80 మంది విద్యార్థులకు 77 మంది హాజరు కాగా, 61మంది గైర్హాజరయ్యారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్‌పై ఫిర్యాదు

తాండూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాతపై తాండూరు పట్టణ బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, పటేల్ విజయ్‌కుమార్ తదితరులు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి శనివారం ఫిర్యాదు అందజేశారు. కాల్వ సుజాత.. తన ఫేస్‌బుక్ ఖాతా నుంచి ప్రధాని నరేంద్ర మోదీని అగౌరవపరిచేలా వీడియోచేసి పోస్ట్ చేశారని పేర్కొన్నారు. మోదీ మనోభావాలు దెబ్బతిసేలా సుజాత వ్యవహరించారన్నారు. అంతేకాకుండా ప్రధానిమోదీ.. పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ ఒడిలో కూర్చున్నట్లుగా తయారు చిత్రాన్ని పోస్టుచేశారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ప్రధాని, దేశ పౌరుల మనోభావాలకు భంగం కలిగించేలా రూపొందించిన పోస్టును సోషల్ మీడియా నుంచి తొలగించాలని కోరారు. ఫేక్ పోస్టు చేసిన కాల్వ సుజాతపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు పోలీసులను డిమాండ్ చేశారు.

రూ.16కోట్లతో చిలుకవాగు పనులు

తాండూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ముంపు ప్రాంతాల్లోని ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు రూ.16కోట్ల వ్యయంతో చిలుక వాగు ప్రక్షాళన చేపట్టినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆయన చిలుక వాగు పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాది లోపే ఎన్నో ఏళ్ల పెండింగ్‌లో ఉన్న చిలుకవాగు ప్రక్షాళన పనులను చేపట్టామన్నారు. సాయిపూర్ ప్రాంతంలో పనులు మొదలయ్యాయని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో చిలుకవాగు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, అతిత్వరలో పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేసి ముంపు ప్రాంతాల ప్రజల బాధలు తీరుస్తానని చెప్పారు.



చిలుకవాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

వ్యవసాయమే జీవనం.. అందరికీ ఆదర్శం

● ఆధునిక సాగులో రాణిస్తున్న కంది సోదరులు



రాజేందర్‌రెడ్డి సాగుచేస్తున్న వంకాయ తోట

మంచాల, మే 24(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మంచాల మండల పరిధి జాపాల గ్రామానికి చెందిన కందిమల్ల రాజేందర్‌రెడ్డి, కందిమల్ల శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరు అన్నాదమ్ముళ్లు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఇంటర్ వరకు చదువుకున్న వీరు చిన్నప్పటి నుంచి తండ్రి కందిమల్ల రంగారెడ్డికి వ్యవసాయం, పశుపోషణలో చేదుడువాదోడుగా ఉండేవారు. ఇలా వారికి వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు. సంప్రదాయ సాగు విధానాలపై అవగాహన ఏర్పర్చుకున్నారు. తోటివారంతా పైచదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలు చేయాలనే ఆలోచనలు చేస్తుండగా, ఈ బ్రదర్స్ మాత్రం సమయం వృథా చేయకుండా తమకిష్టమైన వ్యవసాయ రంగాన్నే ఎంచుకున్నారు. వారికున్న ఆరు ఎకరాలకు తోడుగా పక్కనే ఉన్న మరో పదెకరాల వ్యవసాయ భూమిని లీజుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు. సాగులో ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ నాణ్యమైన దిగుబడులు పొందుతున్నారు. వారు పండించే కూరగాయలను స్వయంగా మార్కెట్ తరలించే అక్కడే హోల్‌సేల్‌గా అమ్ముతూ లాభాలు గడిస్తున్నారు.

సమీప రైతులకూ సాయం

కంది సోదరులు సొంత పనులు చూసుకోవడమే కాదు.. ఇతర రైతులకూ సాయం అందించడంలో ముందుంటారు. అలాగే వీరికి చిన్నప్పటి నుంచి గేదెలు, ఆవులను సాకుతూ డెయిరీ ఫాం నిర్వహించిన అనుభవం కూడా ఉంది. పశుపోషణపై కందిమల్ల శ్రీనివాస్‌రెడ్డికి మంచి అవగాహన ఉంది. పాడి ఆవులకు వచ్చే రోగాలను వెంటనే గుర్తించి వాటికి సకాలంలో చికిత్సలు చేస్తుంటాడు. గ్రామానికి చెందిన రైతులు అత్యవసర సమయాల్లో శ్రీనివాస్‌రెడ్డిని వెంట తీసుకెళ్లి పాడిఆవులకు చికిత్స చేయించుకుంటారు. అంతేగాకుండా సోదరులిద్దరు అక్షరాస్యులు కావడంతో పంటల సాగులో కొత్తగా వచ్చే ఆధునిక విధానాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ మార్కెట్‌కు వచ్చిపోయే సమయాల్లో తోటి రైతులకు వివరిస్తుంటారు.

వ్యవసాయాన్నే జీవనంగా ఎంచుకున్నాను



మధ్య తరగతి కుటుంబం కావడంతో పైచదువులు సాధ్యం కాలేదు. వ్యవసాయం కాకుండా ఏదైనా చేయొచ్చు కదా అని చాలామంది అనేవారు. కానీ ఇతరులపై ఆధార పడకుండా బతకాలనే సంకల్పంతో నాకు నచ్చిన రంగాన్ని ఎంచుకోవాలని నిర్ణయించుకున్నాను. కొత్తగా వేరే రంగంలోకి వెళ్లేది ఎందుకుని చిన్నప్పటి నుంచి తెలిసిన వ్యవసాయన్నే జీవనోపాధిగా ఎంచుకున్నాను. డ్రిప్, తుంపర, మల్చింగ్, పందిరి సాగు పద్ధతుల్లో కూరగాయలను పండిస్తున్నాను. దీంతో తక్కువ నీటితోనే సాగు సాధ్యమవుతోంది. పేరొందిన కంపెనీల నుంచి ఆన్‌లైన్‌లో కొత్తరకం విత్తనాలను బుక్ చేసుకుని సేకరిస్తుంటాం. పంట దిగుబడులు అలాగే వస్తాయి. నాణ్యమైన కూరగాయలు పండిస్తాం కాబట్టి మార్కెట్‌లో ముందుగానే అమ్ముడుపోతాయి.

\- కందిమల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆదర్శ రైతు

రైతుబజార్‌లో స్వయంగా అమ్ముతాం



అందుబాటులో ఉన్న నీటి వనరులతోనే కూరగాయలు పండిస్తాను. పొలం పనులకు నా భార్యకూడా తోడుగా వస్తుంది. మాతో పాటు రోజువారీగా నలుగురు కూలీలకు ఉపాధి కల్పిస్తాం. పండించిన పంటలను ఎప్పటికప్పుడు ప్యాకింగ్ చేసి మార్కెట్‌కు తరలిస్తాను. అంతేగాకుండా ఈ కూరగాయలను నేనే స్వయంగా వనస్థలిపురం రైతుబజార్‌లో అమ్ముకుంటాను. కూరగాయలు తాజాగా ఉండడంతో రెగ్యులర్ కస్టమర్లతో వెంటవెంటనే అమ్ముడు పోతాయి.

\- కందిమల్ల రాజేందర్‌రెడ్డి, రైతు, జాపాల

క్రీడలతో స్నేహభావం పెంపు



మన్నెగూడలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులతో అనిల్‌రెడ్డి

పూడూరు, మే 24, (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మన్నెగూడలో రైయిస్‌ఖాన్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల అనిల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. యువతలో ఉన్న క్రీడా ప్రతిభకను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మన్నెగూడలో క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తానన్నారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయిలో పరిగి నియోజకవర్గానికి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు మల్లేశం, మండల నాయకులు దేవన్గూడ వెంకటయ్య, సత్యనారాయణ, బుచ్చన్న, జహీర్, దయానందగౌడ్, వినోద్‌గౌడ్, భాస్కర్ రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు పరిశోధనలు ముఖ్యం



పట్టా ప్రదానం చేస్తున్న వీసీ శంకర్‌లింగం

మొయినాబాద్ రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు పరిశోధనలు కూడా ఎంతో ముఖ్యమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శంకర్ లింగం తెలిపారు. హిమాయత్ నగర్‌లోని యూనివర్సిటీకి చెందిన కన్నెంటి ప్రవీణ్ కుమార్ కెమిస్ట్రీలో ప్రొఫెసర్ టి.నర్సింహస్వామి పర్యవేక్షణలో 'డిజైన్ అండ్ సింథసిస్ ఆఫ్ న్యూస్ ఇమిడేజోల్ డేరివేటివ్స్ యాస్ యాంటీ క్యాన్సర్ ఏజెంట్స్‌పై పరిశోధన పత్రం సమర్పించారు. ఈమేరకు శనివారం వీసీ శంకర్ లింగం ఆయనకు పీహెచ్‌డీ పట్టా అందజేశారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవీందర్, క్రిష్టోఫర్ రూబెన్, సుందర్‌రామ్, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

నిరుపేద కుటుంబాలను ఆదుకుంటాం



చెక్కు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

షాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆదుకుంటామని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. సీఎంఆర్ఎఫ్ కింది పలువురికి రూ.3లక్షల 10వేల చెక్కులు మంజూరయ్యాయి. ఈమేరకు షాబాద్, చేవెళ్ల, పూడూరు మండలాలకు చెందిన బాధిత కుటుంబాలకు శనివారం ఆయన నగరంలోని నివాసంలో అందజేశారు.

సైనికులను అవమానించడం బాధాకరం



మాట్లాడుతున్న వెంకటేష్‌గౌడ్

మొయినాబాద్ రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ పేరిట భారత సైనికులు పాకిస్థాన్‌పై దాడులు చేసిన తరువాత వారు ఏం చేశారో వీడియోలు, ఫొటోలు ప్రపంచం ముందుపెట్టారని, అయితే, పాకిస్థానే సిగ్గుతో తలదించుకుంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం సైనికులను అవమానపర్చినట్లు మాట్లాడుతోందని బీజేపీ ఓబీసీ సెల్ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఎల్గని వెంకటేష్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మండల పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలో విలేఖరులతో మాట్లాడుతూ భారత సైనికులను అవమానపరిచేలా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని ఆరోపించారు. సరిహద్దుల్లో దేశ భూభాగాన్ని కాపాడుతూ.. దేశ సమైక్యత, సమగ్రతలను నిలబెట్టే సైనికుల గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ఇతర నాయకులు అనుమానించేలా.. అవహేళనగా మాట్లాడడం బాధాకరమన్నారు. సర్జికల్ స్ట్రైక్ విషయంలో ఆధారాలు చూపాలని గతంలో కేసీఆర్, కవితలు కూడా అడిగారని గుర్తుచేశారు. పీవోకేను ఎప్పటికైనా భారత్ స్వాధీనం చేసుకోవడం ఖాయమన్నారు. బీఆర్ఎస్‌లో దెయ్యాలు, కోవర్టులు ఎవరో ఎమ్మెల్సీ కవిత చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాపాలను ఎమ్మెల్సీ కవిత తన లేఖ ద్వారా బయటపెట్టారని అన్నారు.


ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, ఆర్డీవో అనంతరెడ్డి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఆదిభట్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకుంటామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. శనివారం ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని ప్రమిద గార్డెన్‌లో ఆదిభట్ల, తుర్కయంజాల్‌కు చెందిన లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో భాగంగా మొదటి దఫా పారిశుధ్య కార్మికులకు, దివ్యాంగులకు, వితంతులకు ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆదిభట్ల, తుర్కయంజాల్ మున్సిపాలిటీలకు 822 ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. ఆలస్యం చేయకుండా వెంటనే గ్రౌండింగ్ పనులు మొదలు పెట్టాలని సూచించారు. నియోజకవర్గంలో వందల ఎకరాలు ప్రభుత్వం భూమి కబ్జాకు గురైందన్నారు. ఆ భూమిని పేదలకు పంచుతామన్నారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ డీసీ నాయక్, ఆర్డీవో అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు బాలకృష్ణ, అమరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహిపాల్, లక్ష్మీపతిగౌడ్, ఈ.సీ శేఖర్‌గౌడ్, పాండురంగారెడ్డి, గౌని బాల్‌రాజ్, రంజిత్‌కాంత్, రాజు, మున్సిపల్ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి ప్రాధాన్యం

కులకచర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. మండలంలోని బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన చెంచు కుటుంబాలకు పీఎం జన్‌మన్ యోజన పథకం కింద 43 ఇళ్లు మంజూరయ్యాయి. సంబంధిత హౌజింగ్ ఏఈ హర్షవర్ధన్‌గౌడ్ శనివారంచెంచు కుటుంబాలను పరిశీలించారు. అంతారం గ్రామానికి ఎనిమిది, కుసుమసముద్రంకు 26ఇళ్లు పీఎం జన్‌మన్ యోజన పథకం కింద మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్ రెడ్డి, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, అంజిలయ్యగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఎల్లప్ప, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల విచారణ


అంతారం తండాలో విచారణ జరుపుతున్న నందిని

తాండూరు రూరల్, మే 23, (ఆంధ్రజ్యోతి): అంతారం తండాలో ఇందిరమ్మ ఇళ్లపై శనివారం మండల పంచాయతీ రాజ్ ఏఈ నందిని విచారణ జరిపారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఇందిరమ్మ ఇళ్లు పొందడానికి అర్హులా, వారికి భూమి ఎన్ని ఎకరాలు ఉంది, గతంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులా, వార్షిక ఆదాయం ఎంత ఉంది, దారిద్య్రరేఖకు దిగువన ఉన్న కుటుంబమేనా అనే విషయాలపై సమగ్ర విచారణ జరిపారు. ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం విచారణ జరిపినట్లు మండల పంచాయతీ రాజ్ ఏఈ, విచారణాధికారి నందిని తెలిపారు. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి అంబిక తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్లార్

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మహేశ్వరం, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. శనివారం తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అవకతవకలకు తావులేకుండా చూసుకునే బాధ్యత ఇందిరమ్మ కమిటీలదేనన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ అమలు వంటి విషయాల్లో కాంగ్రెస్ చరిత్ర సృష్టించిందన్నారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంతో బడుగు, బలహీన వర్గాలకు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ అరాచకాలను వివరించాలని తెలిపారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, జంగారెడ్డి, కాకి ఈశ్వర్, నడికూడ శివ, రాజునాయక్‌తో పాటు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నృత్యోత్సవాల నిర్వహణ అభినందనీయం


మాట్లాడుతున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

కొడంగల్, మే 24(ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న జానపద కళలను వెలుగులోకి తేవడం అభినందనీయమని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, ఆర్ఎస్‌పీ ఆర్ట్స్ అకాడమీ కొడంగల్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం రాఘవేంద్ర ఫంక్షన్ హాలులో మాధురి డ్యాన్స్ శిక్షణ శిబిరం ముగింపులో భాగంగా నృత్యోత్సవాన్ని నిర్వహించారు. వేడుకకు హాజరైన గుర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొదటిసారి కొడంగల్‌లో నృత్యోత్సవాలను నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఈ వేడుకను నిర్వహించిన ఆర్ఎస్‌పీ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ ప్రకాశ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 80మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌స్వామిజీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, వైద్యులు రవీందర్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ జాతీయ కో-ఆర్డినేటర్ కృష్ణంరాజు, కృష్ణయ్య, రమేశ్ మాస్టర్, రవిరాథోడ్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం

బషీరాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వానాకాలం సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. మరోవారం, పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే ఆవకాశం ఉండడంతో ముందస్తు వర్షాలతో రైతులు పంటసాగు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు మరోసారి దుక్కులు దున్ని, సేంద్రియ ఎరువులు చల్లే పనుల్లో బిజీగా ఉంటున్నారు. ఇప్పటికే సాగుకు పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు పెట్టుబడుల కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వద్ద రుణ ప్రయత్నాలు మొదలుపెట్టారు.

పాతికేళ్ల కల.. నెరవేరుతున్న వేళ!


పాత నిర్మాణం రైల్వే బ్రిడ్జి

చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జికి మోక్షం.. రూ. 184 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వాలు
ఆరునెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక.. హర్షం వ్యక్తం చేస్తున్న షాద్‌నగర్ వాసులు


గేటు వద్ద నిలిచిన వాహనాలు

షాద్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పది నిమిషాలకు ఒక రైలు వస్తుంది.. పదేపదే గేటు మూసివేస్తారు.. రైలు వెళ్లే వరకు ఆ దారి వెంట వెళ్లే వాహనదారులు, ప్రజలు గంటల తరబడి వేచిచూడాలి. ఇదీ నిత్యం చటాన్‌పల్లి రైల్వే గేటు సమీపంలో జరిగే తంతు. రైల్వే బ్రిడ్జి లేకపోవడంతో ఈ ప్రాంతంలో ప్రజలు నరకం చూస్తున్నారు. షాద్‌నగర్ పట్టణం నుంచి బైపాస్‌కు, పలు గ్రామాలకు వెళ్లాలంటే ఇదొక్కటే మార్గం. ఈ గేటు సమీపంలో వంతెన నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు నాయకులు హామీ ఇస్తున్నారే తప్పా బ్రిడ్జి నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. కానీ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో వైజంక్షన్ నిర్మాణానికి మోక్షం లభించింది. వంతెన నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడంతో స్థానికులతో పాటు, బైపాస్ మీదుగా వెళ్లే పలు గ్రామాలకు చెందిన ప్రజలు, వాహనాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే బ్రిడ్జికి నిధులు మంజూరైన విషయం తెలుసుకున్న చటాన్‌పల్లి గ్రామ ప్రజలతో పాటు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనతరం ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు.

ఏళ్లుగా ఎదురుచూపు

షాద్‌నగర్ రైల్వే గేట్ వద్ద వంతెన నిర్మించాలన్నది పాతికేళ్ల కల.. దీనికోసం అప్పటి ప్రజాప్రతినిధులు మొదలుకుని ఇప్పటి ఎమ్మెల్యే వరకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. కానీ బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగిలిపోయింది. షాద్‌నగర్ మీదుగా రోజుకు 40కు పైగా ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్లు వెళ్తుంటాయి. దాంతో రైలు రావడానికి 10 నిమిషాల ముందే గేట్‌ను మూసేస్తారు. దీంతో అప్పటికే కొన్ని వందల వాహనాలు గేట్ వద్ద బారులు తీరుతుంటాయి. గేట్ తెరిచిన తర్వాత ట్రాక్ దాటాలంటే వాహనదారులకు కనీసం 40నిమిషాల సమయం పడుతుంది. ఈలోపే మరో రైలు వస్తే మళ్లీ గేటు మూసేస్తారు. ఇలా నిత్యం గేటు వద్ద వాహనదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. కనీసం అంబులెన్స్‌లు సైతం వెళ్లలేని పరిస్థితి. సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే వంతెన నిర్మాణానికి కృషిచేశారు. పనులు కూడా మొదలు పెట్టారు. కాని ఆ వంతెన నిర్మాణం కేవలం గేటు దాటడానికి మాత్రమే ఉపయోగపడుతుందని, వంతెన మీదుగా పరిసర గ్రామాలైన బుచ్చిగూడ, దూసకల్, వెలిజర్ల, ఎక్లాస్‌ఖాన్‌పేట్, జేపీదర్గా లాంటి ప్రదేశాలకు వెళ్లాలంటే వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వంతెన నిర్మాణం పనులను నిలుపుదల చేయించారు. కేవలం 'ఫై' వంతెన మాత్రమే కాకుండా 'వై' వంతెన నిర్మించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి రైల్వే శాఖ అధికారులు కూడా సమ్మతించారు.

రూ.184 కోట్లు మంజూరు..

'వై' వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే అటు రైల్వే శాఖ, ఇటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరిపారు. రైల్వేగేట్ వద్ద వాహనదారులు, సాధారణ ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితిని అర్థం చేసుకున్న రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు 'వై' జంక్షన్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.184 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవో నెంబర్ 245 ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే నిర్మాణం పనులు చేపట్టి ఆరు నెలల్లో బ్రిడ్జిని అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఇచ్చిన హామీని నెరవేర్చాను



ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాను. ఇది ప్రజల గొప్పతనం. ప్రజా అవసరాలను తీర్చగల వ్యక్తిని గుర్తించి ఓటు వేసి గెలిపించినందుకు ఇప్పుడు ఫలితం దక్కింది.. ప్రజాప్రతినిధులు ఏసీ గదుల్లో కూర్చుంటే పనులు జరగవు. ప్రజల వద్దకు వెళ్లి వారి అవసరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటిని పరిష్కరించాలి. ఆర్‌వోబీ నిర్మాణం నా కల. అది నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఉంది.

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్

ఆర్‌వోబీకి గ్రీన్ సిగ్నల్ రావడం హర్షణీయం



చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలపడం హర్షణీయం. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నేను కూడా పలుమార్లు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశాను. ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మాణంతో వాహనదారుల ఇబ్బందులు తొలగనున్నాయి. పనుల్లో జాప్యం లేకుండా వేగవంతంగా నిర్మాణం పూర్తి చేయాలి.

- నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

అధైర్య పడొద్దు అండగా ఉంటా

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


నందిగామ : మేకగూడలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, మే 24(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు అధైర్యపడవద్దని ఎలాంటి కష్టమొచ్చినా అండగా ఉంటానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మండలంలోని మేకగూడ, సంఘిగూడలో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే నాయకులతో కలసి భూమి పూజ చేశారు. మొదటివిడతలో మేకగూడలో 10, సంఘిగూడలో 10 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. మేకగూడలో రూ.20లక్షలతో మైనారిటీ భవనం, బీసీ సబ్‌ప్లాన్ నిధులు రూ.25లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ భవనానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. మైక్రోసాఫ్ట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సహకారంతో మేకగూడలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు, సోలార్ లైట్లు, మహిళా సమాఖ్య అభివృద్ధికోసం శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సంఘిగూడలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు, రూ.10 లక్షలతో మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో సుమతి, నాయకులు జంగ నర్సింలు, శివశంకర్‌గౌడ్, విఘ్నేశ్వర్‌రెడ్డి, పర్వతాలు, సూక్యనాయక్, బండారి రాజు, నర్సింహరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, శ్రీను, మల్లేష్, సత్యనారణరెడ్డి, దామోదర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, నర్సింహ్మా, యాదయ్య, సత్తయ్య, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

షాద్‌నగర్ అర్బన్ : రైతులకు కల్తీ, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సమావేశ హాలులో శనివారం డివిజన్ స్థాయి విత్తనాల, ఎరువుల, క్రిమి సంహారక మందుల డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. షాద్‌నగర్ ఏడీఏ నిషాంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించడానికి వ్యాపారులు చొరవ చూపాలని, ఆ దిశగా వ్యవసాయాధికారులు శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. డీఏవో నర్సింహారావు మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో ఏర్పాటవుతున్న మండల టాస్క్‌ఫోర్స్ బృందాలు అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేస్తాయని చెప్పారు. నకిలీ, కల్తీ విత్తనాలు విక్రయించే వారి సమాచారం తమకు ఇవ్వాలని షాద్‌నగర్, శంషాబాద్ ఏసీపీలు ఎస్.లక్ష్మీనారాయణ, శ్రీకాంత్‌గౌడ్ కోరారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, షాద్‌నగర్ సీఐ విజయ్‌కుమార్, మండల అధికారులు పాల్గొన్నారు.

బహుళ జాతి సంస్థల సేవలు అజరామరం

కొత్తూర్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో సమాజ సేవ చేయడానికి బహుళ జాతి సంస్థలు ముందుకు రావడం అజరామరమని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఇన్ముల్‌నర్వలో మైక్రోసాఫ్ట్ సహకారంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ లెర్నింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే క్రికెట్ టోర్నీని ప్రారంభించి, విజేతలకు షీల్డ్‌లను బహూకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బహుళజాతి సంస్థలు సీఎస్ఆర్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలతో పాటు, అభివృద్ధి పనులు చేపట్టడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన చందన, భరత్, రాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవికుమార్‌గుప్త, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, శంకర్‌నాయక్, ఖాజు, శేఖర్‌గుప్త, ప్రేమ్‌నాయక్, హబీబ్, బాసునాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

ఇన్ముల్‌నర్వ గ్రామంలో పలువురు నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఎమ్మెల్యే ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించి లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. పలువురు మహిళలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.


సూర్యుడి కాంతిలో ఎర్రగా కనిపిస్తున్న పాంబండ

కనువిందు చేసిన పాంబండ

కులకచర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): సూర్యుడి కాంతిలో మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శోభాయమానంగా కనువిందు చేసింది. శనివారం ఉదయం 8గంటల ప్రాంతంలో మేఘాలు కమ్ముకొని చుట్టూ ప్రాంతం అంతా చీకటిగా మారింది. అదే సమయంలో సూర కాంతి కేవలం పాంబండపైనే పడింది. సూర్యుడి ఎర్రని కాంతిలో పాంబండ చూపరులను ఆకట్టుకుంది. భక్తులు, యాత్రికులు సూర్యుడి కాంతిలో కనిపించిన పాంబండను తమ సెల్ ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు.

వైభవంగా గోదారంగనాయక స్వామి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న పండితులు

షాద్‌నగర్ రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద శివారులోని రంగదాములలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయక స్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు రామా చార్యుల బృందం ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై కల్యాణం తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో శివకుమార్,వెంకటేష్ గుప్త, అనుమారి వెంకటయ్య, ర్యాకల మల్లేష్, చంద్రశేఖర్, యాదగిరి పాల్గొన్నారు.

డీఎస్ఆర్‌పై అభ్యంతరం

తాండూరు, మే 24(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పంచాయతీల్లో న్యూ డీఎస్ఆర్‌పై సిబ్బంది అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. డీఎస్ఆర్ అప్‌డేట్ చేయకుండా తాండూరు పంచాయతీ కార్యదర్శులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఫేస్ రికగ్నైజేషన్, తంబ్ విషయంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీల్లో సాధ్యం కాదంటున్నారు. ఈమేరకు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అప్పటి వరకు డీఎస్ఆర్ యాప్‌ను ఉపయోగించకూడదని పంచాయతీ కార్యదర్శుల సంఘాలు నిర్ణయించారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర

ధారూరు, మే24(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మండలంలో తిరంగా యాత్ర నిర్వహించారు. జమ్మూకశ్మీర్ రాష్ట్రం పహల్గామ్‌లో ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు తిరంగా యాత్ర చేపట్టారు. నాగారంలోని తుల్జాభవానీ ఆలయంలో పూజలు చేసి యాత్ర ప్రారంభించారు. జాతీయజెండాతో నాగారం, మైలారం, తరిగోపుల, జైదుపల్లి, కేరెల్లి, ధారూరు, అవుసుపల్లి, కుక్కింద, గడ్డమీది గంగారం, నాగసమందర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రాజునాయక్, నాయకులు పాండుగౌడ్, వివేకానందరెడ్డి, రాజేందర్‌గౌడ్, నరోత్తంరెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేష్, రవీందర్ గౌడ్, జగదీశ్వర్, విజయలక్ష్మి, సాయిగౌడ్, అంజయ్య, ఉలేందర్, స్థానికులు పాల్గొన్నారు.


వికారాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో విజయోత్సవ సంబురాలు

విజయోత్సవ సంబురాలు

వికారాబాద్ : పాకిస్థాన్‌పై ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా భారత త్రివిధ దళాలకు మద్దతుగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో గణిత ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణా కేంద్రంలో విజయోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గణిత శిక్షణ తరగతుల కోర్సు డైరెక్టర్ జాకా వెంకటేశం, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొత్తగడి అంజిరెడ్డి, మహేంద్ర బహదూర్, ఎం ప్రతాప్, సత్యనారాయణరెడ్డి, శ్రీధర్ రెడ్డి, బసప్ప, సతీష్ కుమార్, గణిత రిసోర్స్ పర్సన్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పరిగి: ర్యాలీలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పరిగిలో ర్యాలీ

పరిగి: ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో దేశ సైనికులకు మద్దతుగా, అమర జవాన్లకు నివాళిలో భాగంగా శనివారం సాయంత్రం పరిగిలో భారీ తిరంగా ర్యాలీని నిర్వహించారు. పరిగి పట్టణంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరదేవాలయం నుంచి ప్రధాన వీధుల గుండా గాంధీచౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. అన్ని రాజకీయ పార్టీలు, అన్ని సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

లింగసమానత్వంపై విద్యావంతుల పాత్ర కీలకం

లింగ సమానత్వంపై విద్యావంతుల పాత్ర కీలకమని పరిగి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప అన్నారు. పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నంబర్ 1 పాఠశాలలో ఉపాధ్యాయులకు శనివారం చట్టాలపై అవగాహన సదస్సు, ఆపరేషన్ సిందూర్ సక్సెస్‌లో భాగంగా జాతీయపతాకాల ప్రదర్శన, అనంతరం రిటైర్డు ఆర్మీఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, రిసోర్స్ పర్సన్లు చిన్నకృష్ణ, ఎండీ ఉస్మాన్‌అలీ, ఆర్మీ రిటైర్డు జవాన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కావలి లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాండూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ నెంబర్-1 పాఠశాలలో చదువుకున్న 1995-96 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. పట్టణంలోని దుర్గా గ్రాండ్యూర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి తాండూరు మండలం కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పూర్వవిద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పూర్వ విద్యార్థులు బాగా చదువుకుని ఒక స్థాయికి ఎదిగినప్పుడు తోటి విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి గురువులు ప్రేమీల, శివ కుమార్, అనంతయ్యలను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఇందిర పవార్, మాజీ సర్పంచ్ ఎం.శిరీష, రాంచందర్, విజయలక్ష్మి, సిరిగిరిపేట్ పండరి, కుర్వ రాములు, విష్ణు, దస్తప్ప, లోక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న అనంతయ్య

దోమ, మే 24 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని మాజీ సర్పంచులు పద్మ, అనంతయ్య అన్నారు. మండలంలోని బాసుపల్లి గ్రామంలో శనివారం చాకలి చిన్న స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఆర్గనైజర్లు నరేశ్, కృష్ణ, రాజు, శ్రీశైలం, శేఖర్ నిర్వహించారు. మొత్తం నాలుగు జట్లు పాల్గొంటాయని తెలిపారు. విజేతకు రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5వేల నగదు బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

కొడంగల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. 87వ వారం పూర్తయిన సందర్భంగా హిందు వాహిని సభ్యులు, యువకులు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పిచ్చి మొక్కల తొలగింపు

దోమ, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఆవరణలో వెలిసిన పిచ్చి మొక్కలు, ఏపుగా పెరిగిన గడ్డిని ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉపాధి కూలీలతో శనివారం తొలగించారు. అదేవిధంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు గ్రామం నుంచి నాగిరెడ్డి చెరువు, పరిగి మండలం నాలాపూరంకు వెళ్లే మెటల్ రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధారూరు మార్కెట్‌లో మొక్కజొన్న బీట్లు

ధారూరు, మే24(ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం మొక్కజొన్న, ధాన్యం బీట్లు నిర్వహించారు. మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,170ల నుంచి రూ.2,250ల వరకు, ధాన్యం 1010 రకం క్వింటాలుకు రూ.1,860ల నుంచి 1,980వరకు, ధాన్యం సోనా రకం క్వింటాలుకు రూ.2వేల నుంచి 2,230ల వరకు ధరలు పలికాయి. మొక్కజొన్న 1211క్వింటాళ్లు, ధాన్యం 221.2 క్వింటాళ్ల క్రయ విక్రయాలు జరిగినట్లు మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించండి

పెద్దేముల్, మే 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత పరిశుభ్రత, భౌతికదూరం పాటించాలని పెద్దేముల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బుచ్చిబాబు సూచించారు. కరోనా బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలని శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే కరోనా బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని చెప్పారు. జ్వరం, ఫ్లూ లక్షణాలు ఉంటే రాష్ట్రహెల్ప్‌లైన్ నంబర్ లేదా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ హెల్ప్‌లైన్ 011-23978046 నంబర్‌కు కాల్‌చేయాలని పేర్కొన్నారు.

గిరిజన హక్కుల సాధన సభను విజయవంతం చేయాలి

పరిగి,మే 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో జూన్ 8న నిర్వహించనున్న గిరిజన హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్ కోరారు. ఖమ్మం సభకు సంబంధించి శనివారం పరిగిలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు గట్యానాయక్, పాండునాయక్, హరినాయక్, రవీందర్‌నాయక్, బాలకృష్ణ, రాంచందర్ పాల్గొన్నారు.

అధునాతన పద్ధతుల్లో బోధించాలి



పరిగి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



కొడంగల్: శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పరిగి, మే 24 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకనుగుణంగా అధునాతన పద్ధతుల్లో బోధించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. ఐదు రోజులుగా పరిగిలోని జడ్పీహెచ్‌ఎస్ నంబర్ 1 పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. టెక్నాలజీని దృష్టిలో ఉంచుకుని బోధించాలన్నారు. భవిష్యత్తులో అన్ని పాఠశాల్లోనూ ఏఐ బోధన జరుగనుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, ఎంఈవో గోపాల్, ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.పార్థసారథి, కె.హన్మంత్, రిసోర్స్‌పర్సన్ ఎండీ ఉస్మాన్ అలీ పాల్గొన్నారు.

పెద్దేముల్: మండల కేంద్రంలో ఐదురోజులుగా జరిగిన ఎఫ్ఎల్ఎన్ ఉపాధ్యాయ శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈవో నర్సింగ్‌రావు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న బోధన అభ్యసన పద్ధతులను ఉపాధ్యాయులందరూ తరగతి గదుల్లో అమలు పరచాలని సూచించారు. కార్యక్రమ ముగింపు సందర్భంగా శిక్షణా తరగతులను విజయవంతంగా నిర్వహించిన మండల రిసోర్స్‌పర్సన్స్ బంద్యప్ప, నర్సిరెడ్డి, విజయనర్సింహులు, శోభన్‌బాబు, నర్సింహులు, రహమత్, రమేష్, రాఘవేందర్‌లను మండల విద్యాధికారి, ట్రైనింగ్‌సెంటర్ ఇంచార్జ్ ఉపాధ్యాయులు ద్యావరి నరేందర్‌రెడ్డిల సమక్షంలో వారిని సన్మానించారు.

దుద్యాల: ఉపాధ్యాయుడు విద్యార్థుల స్థాయిని అంచనావేస్తూ పాఠ్యపుస్తకం ఆధారంగా ఇచ్చిన పాఠ్యాంశం యొక్క లక్ష్యాలను నెరవేర్చే విధంగా విద్యాబోధన జరగాలని రాష్ట్ర రీసోర్స్ పర్సన్ కే.బాలాజీ అన్నారు. ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణలో భాగంగా శనివారం ఆయన బోధన పద్ధతులపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయరామారావు, కేంద్రం ఇన్‌చార్జి కే.రవీందర్‌గౌడ్, ఎమ్మార్పీలు సంపత్‌కుమార్, వెంకటయ్య, శంకరప్ప, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎంఈవో మల్లేశం అన్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న శిక్షణను శనివారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్పల్లి: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని శిక్షకులు జంగయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో శిక్షణ ముగింపు సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు కేశవులు, గణేశ్, రమేశ్ పాల్గొన్నారు.

చౌడాపూర్: ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా బోధించాలని చౌడాపూర్ ఎంఈవో రాంచందర్ అన్నారు. శనివారం ఐదవ రోజు ఉపాధ్యాయులకు శిక్షణలో ఆయన మాట్లాడారు. మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడంగల్: విద్యార్థులకు బోధన అభ్యాసనంపై ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ శనివారం కొనసాగింది. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో నిర్వహించిన శిక్షణలో కొడంగల్ మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంఈవో రాంరెడ్డి మాట్లాడుతూ తరగతి గదిలో విద్యార్థులకు సరళమైన పద్ధతిలో పాఠాలు బోధించడంతో సులభంగా అర్థం అవుతుందన్నారు.

తాండూరు రూరల్: పట్టణంలోని జీజేసీ జూనియర్ కళాశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ శనివారం ముగిసింది. తాండూరు మండల విద్యాధికారి వెంకటయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు మెరుగైన ఫలితాలు సాధించేందుకే ప్రభుత్వం ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిందని అన్నారు. అనంతరం మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిష్టప్ప, నాగప్ప, పురుషోత్తంరెడ్డి, రాంనర్సింహారెడ్డి, వినోద్, జైపాల్‌రెడ్డి, జట్టూరి శ్రీనివాస్ పాల్గొన్నారు

పాలీసెట్ ఫలితాల్లో బాలికల హవా

- ఎంపీసీ, ఎంబైపీసీ విభాగాల్లో జిల్లాలో టాప్ ర్యాంకులు
- 2, 3 స్థానాలను కైవసం చేసుకున్న వికారాబాద్ విద్యార్థులు

వికారాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలీసెట్-2025 ఫలితాల్లో బాలికలు సత్తాచాటారు. ఎంపీసీ, ఎంబైపీసీ విభాగాల్లో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. పాలీసెట్‌కు 1,282 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 1,162 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బాలురు 708మంది పరీక్షకు హాజరు కాగా, 561మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 574మంది హాజరు కాగా, వారిలో 501మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లా విద్యార్థులు 84.16శాతం ఉత్తీర్ణులు కాగా, ఎంపీసీ విభాగంలో 82.84శాతం, ఎంబైపీసీ విభాగంలో 85.49శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నారు. ఎంపీసీ విభాగంలో బాలికలు 87.28శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలుర 79.24శాతం ఉత్తీర్ణులయ్యారు. ఎంబైపీసీలో బాలికలు 90.24శాతం ఉత్తీర్ణులు కాగా, బాలురు 85.49శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా విద్యార్థులు ఎంపీసీ, ఎంబైపీసీ విభాగాల్లో మంచి ప్రతిభ కనబరిచారు. తాండూరు పట్టణానికి చెందిన గొట్లపల్లి తేజస్విని, వికారాబాద్ పట్టణానికి చెందిన గుమ్మడి అభిజ్ఞ ఎంబైపీసీ, ఎంపీసీ విభాగాల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించారు. ఎంబైపీసీ విభాగంలో తాండూరు పట్టణంలో విశ్వంభర కాలనీకి చెందిన గొట్లపల్లి తేజస్విని (హాల్ టికెట్ నం:3501029) 11వ ర్యాంకు కైవసం చేసుకోగా, వికారాబాద్ పట్టణంలో బసంత్ కాలనీకి చెందిన తిమ్మమోళ్ల శ్రీమనోజ్ఞ 83వ ర్యాంకు సాధించగా, వికారాబాద్ ఎన్నేపల్లి శ్రీసాయి నగర్ కాలనీకి చెందిన గుమ్మడి అభిజ్ఞ 93వ ర్యాంకు సాధించారు. ఎంపీసీ విభాగంలో తాండూరు పట్టణానికి చెందిన గొట్లపల్లి తేజస్విని (హాల్‌టికెట్ నం:3501029) రాష్ట్ర స్థాయిలో 40వ ర్యాంకు సాధించింది. వికారాబాద్ ఎన్నేపల్లి శ్రీసాయినగర్ కాలనీకి చెందిన గుమ్మడి అభిజ్ఞ 90వ ర్యాంకు సాధించగా, అయ్యప్ప కాలనీకి చెందిన తడకల వర్షిత్‌రెడ్డి 119వ ర్యాంకు సాధించారు.

మన లైబ్రరీ

(ఏడో పేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకు రావాలన్నదే లక్ష్యంగా ఈ కార్యక్రమం రూపొందించారు. మహిళలను సాధికారత దిశగా ప్రోత్సహించేందుకు, యువత వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. బ్రాంచ్ లైబ్రేరియన్‌తో పాటు ఇక్కడ మరో ఇద్దరు కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు.

సర్వాంగ సుందరంగా...

దౌల్తాబాద్‌లో నిర్మించిన మన లైబ్రరీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జిల్లా గ్రంథాలయ సంస్థ రూ.69లక్షలతో కొత్త భవనం నిర్మించి అవసరమైన పుస్తకాలు, ఫర్నీచర్‌ను సమకూర్చింది. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, కార్పొరేట్ సంస్థల సహకారంతో భారత్ దేఖో సంస్థ మన లైబ్రరీని ఆకట్టుకునేలా సుందరీకరించే పనులు చేపట్టింది. ఇక్కడకు వచ్చే వారిని ఆలోచింపజేసే విధంగా ప్రతీ గదిని చిత్రాలతో తీర్చిదిద్దారు. హాల్, గదుల్లో గోడల నిండా రంగురంగుల చిత్రాలను వేశారు. ఈ గ్రంథాలయంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సైన్స్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ పాఠశాలల విద్యార్థులతో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ కార్యకలాపాలను ఆచరణాత్మకంగా నిర్వహించనున్నారు. చిన్నారుల కోసం కిడ్స్ జోన్ ఏర్పాటు చేశారు. ఇది ప్రారంభ విద్యా కేంద్రంగా పనిచేయనుంది. దీంట్లో చిన్నారులకు కథలు చెప్పడం, చేతి పనులు చేయడం, సమస్యలను పరిష్కరింపజేయడం వంటివే కాకుండా ఆటల ద్వారా చదువు నేర్చుకునేలా ప్రోత్సహిస్తారు. అన్ని వయసులు, స్థాయిల వారు తమకు నచ్చిన పుస్తకాలు చదువుకునేందుకు లైబ్రరీ అండ్ రీడింగ్ స్పేస్ ఏర్పాటు చేశారు. చిన్నారులతో పాటు మహిళలు, వృద్ధులకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచుతారు. అంతేకాకుండా యువతీ యువకులకు వివిధ పోటీ పరీక్షల పుస్తకాలను కూడా ఇక్కడ అందుబాటులో ఉంటాయి. డిజిటల్ రీడింగ్ సెంటర్‌లో ఇంటర్నెట్ సదుపాయం కల్పించారు. రెండు కంప్యూటర్లు, ప్రొజెక్టర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ టెక్నికల్ వర్క్‌షాప్‌లు, విద్యా సంబంధిత సినిమా ప్రదర్శనలు నిర్వహిస్తారు. కమ్యూనిటీ సెంటర్‌లో నేర్చుకోవడం, చర్చలు నిర్వహించడం, సాంస్కృతిక మార్పిడి కోసం నెలవారీ సమావేశాలు నిర్వహించనున్నారు.



మన లైబ్రరీ హాల్

వీఏవో పరీక్షకు సర్వం సిద్ధం

(ఏడో పేజీ తరువాయి)

వీరు పనిచేసేవారు. వీరివల్లే భూ సమస్యలు తలెత్తుతున్నాయని బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పాత విధానాన్ని కొనసాగించేందుకు గ్రామ పరిపాలన అధికారులను నియమించనుంది. ఆదివారం నిర్వహించే రాత పరీక్షలో గ్రామ పరిపాలన అధికారి గ్రామంలో నిర్వహించే బాధ్యతలపైనే ప్రశ్నాపత్రం రానున్నట్లు తెలిసింది. గ్రామ లెక్కలు, ధ్రువీకరణ పత్రాల జారీ, ప్రభుత్వ భూములు, భూవివాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రభుత్వ పథకాలు, ఎన్నికల విధులు, తదితరాంశాలపై ప్రశ్నాపత్రం రూపొందించినట్లు సమాచారం.

వికారాబాద్ జిల్లాలో...

వికారాబాద్: గ్రామ పాలన అధికారి పరీక్ష ఆదివారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు నిర్వహిస్తామని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకొని పరీక్ష కేంద్రాన్ని చూసుకోవాలని సూచించారు. రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకు రావాలని, ఒకటి హాల్ టికెట్‌పై అంటించాలని, మరొకటి ఎగ్జామినర్లకు ఇవ్వాలన్నారు. మొబైల్‌ఫోన్లు, డిజిటల్ వాచీలు, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరన్నారు. బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్‌తో మాత్రమే ఎగ్జామ్ రాయాలన్నారు. వివరాలకు 08416-235291/ 9666063340 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.



సమయానికి చేరుకోవాలి: కలెక్టర్

కీసర: గ్రామ పాలన అధికారి పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి సమయానికి చేరుకోవాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు అభ్యర్థులు 8:30గంటలకల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష ముగిసిన అనంతరం జవాబు పత్రాలను నిర్వాహకులు సీల్‌వేసి జేఎన్టీయూకు అందించాలన్నారు. ఉపయోగించని జవాబు పత్రాలను కూడా సేకరించాలన్నారు. పరీక్ష కేంద్రాల తాగునీరు సౌకర్యం కల్పించాలని, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలన్నారు. భద్రత, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు బస్సులు నడపాలని, ఫస్ట్ ఎయిడ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు తెలిపారు.

పూర్వ విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ

ఘట్‌కేసర్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజిగిరి ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫైన్‌ఆర్ట్స్ పాఠశాల, కళాశాలలో 2017 సంవత్సరం నుంచి చదువుకొని ఎలాంటి ఉద్యోగం పొందలేని వారికి కళాశాలలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తామని ప్రిన్సిపాల్ రాము శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 19-25 సంవత్సరాల వయస్సు ఉన్న పూర్వ విద్యార్థులకు జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఉన్నత ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు వెంటనే కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని వివరాలకు 7995010640 కు సంప్రదించాలని తెలిపారు.

ముగిసిన యువజన కాంగ్రెస్ శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న ఉదయ్‌భాను

కీసర, మే 24 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ అధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ మేరకు రాంపల్లి దాయరలోని జరుగుతున్న శిక్షణ శిబిరంలోని రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి యువజన కాంగ్రెస్ నేతలు, నాయకులు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన వైట్ టీ-షర్ట్ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యూత్ కాంగ్రెస్ నేతలు శిక్షణ పొందారు.

విద్యుత్ అధికారులు, సిబ్బందికి కొత్త సెల్‌నంబర్లు

బషీరాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ శాఖ అధికార, సిబ్బందికి ప్రభుత్వం కొత్త ఫోన్ నంబర్లను కేటాయించింది. ఈ మేరకు ఆ శాఖ ఏఈ అరవింద్ శనివారం వెల్లడించారు. కరెంట్ సమస్యలు ఏమైనా ఉంటే ఈ కింది నంబర్ల ఎల్‌ఎం(లైన్‌మెన్), ఎఎల్‌ఎం(అసిస్టెంట్ లైన్‌మెన్)లకు వినియోగదారులు సంప్రదించాలని ఆయన కోరారు. బషీరాబాద్ ఇన్‌చార్జి ఏఈ అరవింద్ సెల్: 87124 69752, బషీరాబాద్ లైన్‌మన్ రాజు 90005 33617, ఏఎల్‌ఎం ఉమేష్ 77990 35543, అగ్గనూర్ ఫీడర్ ఏఎల్‌ఎం రోహిత్ 72075 20691, ఏఎల్‌ఎం గోవింద్ 81796 47753, జలాల్‌పూర్ ఏఎల్‌ఎం శాంతప్ప 91000 49750, ఏఎల్‌ఎం అనిల్‌కుమార్ 88867 75802, నీళ్లపల్లి ఫీడర్ ఎఎల్‌ఎం గోవింద్ 81796 47753, కాశీంపూర్ లైన్‌మన్ సంజీవరెడ్డి 96524 76537 దామర్‌చెడ్ ఫీడర్ ఏఎల్‌ఎం అనిల్‌కుమార్ 88867 75802, మైల్వార్ ఫీడర్ ఏఎల్‌ఎం తిప్పణ్ణ సెల్:99514 97819 నెంబర్లను కేటాయించారు.

50శాతం సబ్సిడీపై విత్తనాల విక్రయం

శామీర్‌పేట, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు 50శాతం సబ్సిడీపై విత్తనాలను వ్యవసాయశాఖ ద్వారా విక్రయిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రమేశ్ తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ విత్తనాలను సబ్సిడీపై మండల వ్యవసాయ కార్యాలయంలో విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలతో మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రందించాలని రైతులకు సూచించారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

వికారాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. వికారాబాద్ చిట్టిగిద్ద మధ్య కిలోమీటర్ నెం. 113/7,5 వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మే 22వ తేదీ రాత్రి 10.45 గంటల ప్రాంతంలో విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే 20016 నంబరు గల ఎక్స్‌ప్రెస్ రైలు ట్రాక్‌పై ఉన్న వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో ఆయన వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి వయసు సుమారు 35 నుంచి 45మధ్య ఉంటుందని, ముదురు మల్లె రంగులో ఉండి, నీలం రంగు షర్ట్‌లేత ఆకుపచ్చ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. అతడి వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లభించలేదని చెప్పారు. ఈ మేరకు వికారాబాద్ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు వికారాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

చల్లబడిన వాతావరణం

- తగ్గిన ఉష్ణోగ్రతలు
- పలుచోట్ల చిరు జల్లులు

తాండూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రతతో తల్లడిల్లుతున్న ప్రజానీకానికి తాత్కాలిక ఉపశమనం లభించింది. తాండూరు ప్రాంతంలో శనివారం ఒక మోస్తారు వర్షం కురిసింది. ఉష్ణోగ్రతలు సాధారణ కన్నా ఐదారు డిగ్రీలు తగ్గాయి. గతనెల రోజులుగా ఎండలతో తాండూరు ప్రాంతం అల్లాడిపోయింది. వేడిగాలులు, ఉక్కపోత నుండి ఉపశమనం పొందారు. వాతావరణం చల్లబడటంతో రైతులు, చిరువ్యాపారులు, దినసరి కూలీలు మధ్యాహ్నం వేళ పనులు చేసుకున్నారు.

వికారాబాద్‌లో తుంపర్ల వర్షం

వికారాబాద్: నియోజకవర్గంలో శనివారం సాయంత్రం నుంచి అక్కడక్కడ తుంపర్ల వర్షం కురిసింది. పలు ప్రాతంలో వర్షం కురిసి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో మూడు నాలుగు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



అవగాహన కార్యక్రమంలో అధికారులు, రైతులు

మోమిన్‌పేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యవసాయ శాఖ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం తాండూరు వారు సంయుక్తంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని శనివారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు సుజాత, యమున రైతులకు పంటలసాగుపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ సేంద్రియ ఎరువులతో పంటలను సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అదేవిధంగా నీటి వృథాను అరికట్టేందుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి జయశంకర్, ఏఈవోలు పాల్గొన్నారు.

కడా నిధులతో వీధి దీపాల ఏర్పాటు



వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిచెట్టు తండా పంచాయతీ పరిధిలోని బోడబండ తండాలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. శనివారం కడా ప్రత్యేక నిధులతో తండాలో నూతన వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాలు, తండాల్లో సమగ్ర అభివృద్ధి కోసం నిధులు మంజూర్ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ రవినాయక్, నాయకులు రాజునాయక్, తుల్జనాయక్, తండావాసులు సోమ్లనాయక్ పాల్గొన్నారు. అదేవిధఃగా మహంతీపూర్ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.2లక్షల 50వేలతో శనివారం 17వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాజా, మాజీ సర్పంచ్ మహిపాల్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూర్ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సిములు, మొగులయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే



రైతుల పొలాల్లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

దుద్యాల, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం సేకరించిన భూముల్లో అధికారుల సర్వే కొనసాగుతోంది. లగచర్ల, హకీంపేట్ శివారులో గల రైతుల పొలాల్లో తహసీల్దార్ కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం రెండో రోజు హార్టికల్చర్, ఆర్‌అండ్‌బీ, భూగర్భజల వనరులశాఖ, అటవీ శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు పర్యటించి రైతుల పొలాల్లో ఉన్న వివిధ రకాల చెట్లు, బోరు బావులు, బోరు మోటార్లు, పశువుల షెడ్లు, తోటలు, ఈత, తాటి చెట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తహసీల్దార్ తెలిపారు. పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు యాదగిరి, రవూఫ్, సత్యనారాయణ, రవిగౌడ్ పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నవీన్ పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం

దుద్యాల, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంత్రకుంట తండాలో బోరు మోటార్ నుంచి వాటర్ ట్యాంకు వరకు గల పైపులైన్ పనులను ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు రవినాయక్, పంచాయతీ కార్యదర్శి కిషన్ శనివారం ప్రారంభించారు. రూ.5లక్షలు కడా నిధులతో పైపులైన్ పనులను చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శల్యానాయక్, మాణిక్యనాయక్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు పరామర్శ

కులకచర్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదానికి గురైన మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్నయ్యను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు శనివారం పరామర్శించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్నయ్య పది రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది వెన్నచెడులో ఇంటి వద్ద ఉంటున్నారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు ఎల్లప్ప, భరత్‌కుమార్‌రెడ్డి, ఎండీ.హాజీపాష పాల్గొన్నారు.